పత్రికా ప్రకటన - 1

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 31.07.2014

నిజామాబాద్ జిల్లాలోని గుత్ప ఎత్తిపోతల పథకాన్ని, పోచారం ప్రాజెక్టును విస్తరించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. అదే జిల్లాలోని అంకాపూర్ గ్రామంలో అధునిక వ్యవసాయ పద్ధతుల పరిశోధన, అభివృద్ధికి, మోతె గ్రామంలో పసుపు శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. త్వరలోనే నిజామాబాద్ జిల్లాలో పర్యటిస్తానని కూడా ముఖ్యమంత్రి ప్రకటించారు.

సచివాలయంలో గురువారం నిజామాబాద్ జిల్లాలో నీటి పారుదల, వ్యవసాయం, ఉద్యానవన అభివృద్ధి కోసం తీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నీటి పారుదల శాఖామంత్రి తన్నీరు హరిష్ రావు, ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్ రెడ్డి, జీవన్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్దన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి పూనం మాలకొండయ్య, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నిజాంసాగర్ ఆయకట్టుకు సంబంధించిన 38 వేల ఎకరాలను స్థిరీకరించేందుకు గుత్ప ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నారు. దాదాపు రెండు టిఎంసిల నీటిని లిఫ్టు చేస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్టును మరింత విస్తరించాలని ఈ సమీక్షలో ముఖ్యమంత్రి చెప్పారు. జాక్రాన్ పల్లి, వేల్పూర్ మండలాల వరకు కూడా నీటిని పంపే విధంగా ప్రాజెక్టు పరిధిని పెంచాలని, ఇందుకు సంబంధించి వెంటనే సర్వే చేయాలని ముఖ్యమంత్రి కోరారు. నిజామాబాద్ జిల్లాలోనే పోచారం ప్రాజెక్టును కూడా 4 - 5 టిఎంసిల స్థాయికి పెంచాలని సిఎం ఆదేశించారు. ప్రస్తుతం రెండు టిఎంసిలకు తక్కువగానే ఈ ప్రాజెక్టు ద్వారా నీటి వినియోగం జరుగుతుందని, ఇది రైతుల అవసరాలు పెంచలేక పోతున్నదని ముఖ్యమంత్రి చెప్పారు. గ్రావిటీ ద్వారానే ఈ ప్రాజెక్టు ద్వారా నీరందించే అవకాశం వున్నందున, జాక్రాన్ పల్లి, వేల్పూర్ మండలాలలకు సాగునీరు అందించడం కోసం వెంటనే విస్తరణపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టులను ఏడాది లోగానే విస్తరించాలని కూడా సిఎం వెల్లడించారు.

నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ గ్రామంలో రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారని, మెరుగైన సాగు పద్ధతులతో పాటు మార్కెటింగ్ చేసుకోవడంలో కూడా పరిణితి చెందారని ముఖ్యమంత్రి చెప్పారు. ఆక్కడి రైతులకు ప్రభుత్వం తరపున మరింత సహకారం అందిస్తే అంకాపూర్ గ్రామం మొత్తం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. అంకాపూర్‌లో భూములకు భూసార పరీక్షలు నిర్వహించాలని, రైతులకు ఆధునిక పరికరాలు అందించాలని, డ్రిప్ ఇరిగేషన్, గ్రీన్ హౌజ్ కల్టివేషన్ లాంటి వ్యవసాయ పద్ధతులను అందుబాటులోకి తేవాలని

ముఖ్యమంత్రి సూచించారు. అంకాపూర్‌ను రైతులందరూ ఆదర్శంగా తీసుకునే ఓ శిక్షణా కేంద్రం కావాలని ముఖ్యమంత్రి చెప్పారు.

వేల్పూర్ మండలం మోతె గ్రామంలో పసుపు శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఎన్నికల సమయంలో ఈ హామిని మోతె గ్రామస్తులకు ఇచ్చినట్లు కూడా గుర్తు చేశారు. మోతెతో పాటు నిజామాబాద్ జిల్లాలో చాలా గ్రామాల్లో పసుపు పంట పండిస్తున్నారు కాబట్టి పసుపు పంట అభివృద్ధి కోసం, మంచి దిగుబడులు రావడం కోసం, పసుపును శుద్ధి చేయడం కోసం అవసరమైన సంస్థలను జిల్లాలో స్థాపించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. కేంద్ర స్పైసెస్ బోర్డు సహకారంతో తెలంగాణలో పసుపు అభివృద్ధి సమగ్ర పథకాన్ని (Integrated project for Development of Termeric in Telangana) తీసుకురావాలని కూడా కేసిఆర్ చెప్పారు. నిజామాబాద్ జిల్లాలోని నేలలు, వాతావరణం పసుపు పంటకు చాలా అనుకూలమైనవని, 1250 ఎకరాల విస్తీర్ణంలో ఈ పైలట్ ప్రాజెక్టును నెలకొల్పాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రైతులకు పసుపు పంట సాగుకు కావలసిన సాంకేతిక నైపుణ్యం అందడంతో పాటు రైతులకు ఆర్థికంగా కూడా ఉపయోగకరంగా వుంటుందని ముఖ్యమంత్రి చెప్పారు.

నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు అధ్వాన్న స్థితిలో వున్నాయని, అన్ని కార్యాలయాలు ఒకే చోట వుండే విధంగా కొత్త భవనాలు నిర్మించాలని కూడా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

---

**సిపిఆర్ఓ టు సిఎం.**